ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో భేటీ

ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రితో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

అనంతపురం కలెక్టరేట్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో అనంతపురం జిల్లా కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ఎస్పీ మురళీకృష్ణలు సమావేశం అయ్యారు. అమరావతి రాష్ట్ర సచివాలయం 5వ భవనంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా వారిని కలిసి కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా పరిస్థితులను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి కలెక్టర్, ఎస్పీ వివరించారు.

'కంపోస్టు'లో అంతా మాయే..!

కాకి లెక్కలతో ఎంబుక్ నమోదు - దొడ్డిదారిన రూ.2కోట్లకు బిల్లులు - ఇంజినీరింగ్ అకౌంట్ సెక్షన్‌లో ఏం జరుగుతోందో..?

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ ఇంజినీరింగ్ అకౌంటింగ్ సెక్షన్ కంపోస్ట్ యార్డ్ బిల్లుల తయారీలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రోజుకు 1000 మెట్రిక్ టన్నుల చెత్తను పొడిచేసి కొత్త డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామని రూ.23కోట్లకు టెండర్‌ను దక్కించుకున్న నోవాస్ గ్రీన్ ఎనర్జీ సిస్టం లిమిటెడ్ పనుల ఒప్పంద పత్రంలో పేర్కొంది. అయితే కార్పొరేషన్‌లో ఒకేసారి రోజుకు 2000 మెట్రిక్ టన్నుల చెత్తను పొడిచేసి పంపినట్లు నమోదు చేయడం ఇంజినీరింగ్ విభాగ అధికారుల అవినీతి చర్యలకు అద్దం పడుతోంది. ఇదే విషయాన్ని కార్పొరేషన్‌లోని ఎగ్జామినర్ విభాగం ప్రస్తావించి పనులు అనుమానాలను వ్యక్తం చేసింది. యంత్ర సామర్థ్యం కన్నా రెండు రెట్లుగా చెత్తను పొడి చేసే సామర్థ్యాన్ని ఎలా కలిగి ఉందో, ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్లను అందించాలంటూ రూ.2కోట్ల బిల్లుల జారీ చేసే అంశంలో ప్రస్తావించింది. నగరంలో ఉత్పత్తి అయ్యే 125 మెట్రిక్ టన్నుల ఇంటింటి చెత్త, డంపర్ బిన్నుల నుంచి సేకరించిన చెత్తను కొత్త డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారా.. లేక పాత కంపోస్ట్ యార్డ్‌కు తరలిస్తున్నారా.. అన్న దానిపై వివరణ ఇవ్వాలని కోరింది. కంపోస్టు యార్డులో 2023 జనవరి 23వ తేదీకి పూర్తి చెత్తను పొడిచేసి తరలించే ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా, 2024 నాటికి కూడా ఇంకా ఆ పనులు జరుగుతూనే ఉండడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించారు. 12.65 ఎకరాల్లో ఎంత చెత్తను నిర్మూలించారన్న అంశంపై స్పష్టతనివ్వాలని పేర్కొంది. ఎంబుక్‌లో నమోదు చేసిన అధికారులు వేయింగ్ యూనిట్ స్టేట్‌మెంట్‌ను పరిశీలించారా.. లేక ఏ ప్రాతిపదికన ఎంబుక్ నమోదు చేశారా అన్న ప్రశ్న లేవనెత్తారు. పొడి చేసిన చెత్తను వాహనంలో లోడింగ్ చేయటానికి వేయింగ్ మిషన్లో తూకం వేయడానికి పట్టే సమయం, చెత్తా తదితర వ్యర్థ పదార్థాలను నిర్మూలించేందుకు చేపట్టే యంత్ర సామగ్రి సామర్థ్యం అంశాలకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని ఆదేశించింది. టెండర్ అగ్రిమెంట్ సమయంలో వసూలు చేయాల్సిన అర్ధశాతం ఈఎండిని వసూలు చేశారా.. చేసి ఉంటే ఆ వివరాలను అందజేయాలని ఇంజినీరింగ్ అకౌంట్ సెక్షన్లను కోరింది. అగ్రిమెంటు నిబంధనల ప్రకారం పార్ట్ బిల్లులో ఎఫ్ఎస్‌డి కింద మినహాయించాల్సిన 7.5 శాతాన్ని మినహాయించకపోవటాన్ని ఎత్తిచూపింది. ఇందుకు సంబంధించిన వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించటంపై ఆ సెక్షన్లను ప్రశ్నించింది. నోవా గ్రీన్ ఎనర్జీ ఇంజినీరింగ్ లిమిటెడ్ కంపెనీ నిబంధనల ప్రకారం సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను అందజేశారా అన్న అంశంపై వివరణ ఇవ్వాలని ఎగ్జామినేన్ విభాగం కోరింది. కంపోస్ట్‌యార్డు అగ్రిమెంట్ ప్రకారం వ్యర్థ పదార్థాల నిర్మూలన ప్రక్రియ ఆలస్యమైతే నిబంధనల ప్రకారం 0.05 శాతం జరిమానా విధించాల్సి ఉంటుంది. ఈ మేరకు అధికారులు ఏం చర్యలు చేపట్టారన్న దానిపైనా వివరాలు ఇవ్వాలని కోరింది. ఈ విషయాలు అన్నింటిపైనా నోవా గ్రీన్ ఎనర్జీ ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు సంబంధించి పార్టీ బిల్ పేమెంట్ కింద పంపిన రూ.2కోట్ల బిల్లుపై ఎగ్జామినేన్ విభాగం వివరణ కోరుతూ ఆ ఫైల్‌ను వెనక్కు పంపింది.

రూ.2కోట్ల బిల్లుకు సంబంధించి అకౌంట్స్, ఇంజినీరింగ్ విభాగాన్ని ప్రశ్నించగా సంబంధిత అధికారులు ఎవరూ తమకేమీ తెలియదని, ఆ ఫైల్ వచ్చిన విషయం తమకు తెలియదని సెలవివ్వటం గమనార్హం. ఎగ్జామినేషన్ విభాగం నుంచి అకౌంట్స్ విభాగానికి వచ్చిన ఫైలుపై తనకేమీ తెలియదంటూ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి ప్రజాశక్తికి తెలిపారు. మరి రూ.2 కోట్ల బిల్లుల సంగతేంటన్న విషయంపై ఇప్పుడు కార్పొరేషన్‌లో చర్చ మొదలైంది. కార్పొరేషన్ విభాగంలో ప్రస్తుతం ఇంజినీరింగ్ అకౌంట్స్ విభాగం ఎవరికి వారు ఈ అవినీతి కంపులో తమపై బురద ఎక్కడ అంటుకుంటుందో అన్న భయంతో వ్యవహరిస్తున్నారు. కాసుల కక్కుర్తితో అవినీతికి పాల్పడిన వివిధ విభాగ అధికారులు క్రమశిక్షణ చర్యల బారిన పడే అవకాశాలు మెండుగా కన్పిస్తున్నాయి. ఈ విషయానికి భయపడి కొందరు అధికారులు బదిలీలకూ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

కంపోస్టుయార్డు అవినీతిపై కలెక్టర్‌ను కలిసి విచారణ కమిటీతో నిజానిజాలు నిగ్గు తేలుస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కౌన్సిల్ సమావేశంలో ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. కాగా జాయింట్ కలెక్టర్ బదిలీ కావడంతో ఆ కమిటీ అటకెక్కింది. రూ.2కోట్ల పార్ట్ పేమెంట్ బిల్లుల్లో వెలుగు చూసిన అక్రమ వ్యవహారాలపై పూర్తి స్థాయి విచారణ జరిగితే కార్పొరేషన్‌లో పలువురు అధికారుల అవినీతి బహిర్గతమయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనటంలో సందేహం లేదని ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర

ఉరవకొండ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

- కాషాయీకరణ చొప్పించే ప్రయత్నం
- విద్యా సమస్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం అవ్వాలి
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్
- ఉరవకొండలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ

ప్రజాశక్తి-ఉరవకొండ

'ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా నేటి పాలకుల చర్యలు ఉన్నాయి. శాస్త్రీ విద్యా విధానం అందించి విద్యార్థులను ప్రయోజకులను చేయాల్సి ఉండగా, విద్యలో కాషాయీకరణ జొప్పించి విద్యార్థులను మతోన్మాద శక్తులుగా మార్చే కుట్ర జరుగుతోంది. ఇలాంటి వాటిని విద్యార్థులు ఐక్యంగా తిప్పికొట్టాలి' అని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. మంగళవారం నాడు ఉరవకొండలో ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా ప్లీనరీ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులతో కలిసి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో గేయానంద్ ప్రసంగించారు. బోధనలో శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయకుండా కొన్ని పాలక పార్టీలు చరిత్రను వెనక్కి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యను కాషాయీకరణ చేస్తూ విద్యార్థులను మతోన్మాద శక్తులుగా మార్చడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రయివేటీకరణ చేస్తూ కార్పొరేట్లకు విద్యారంగాన్ని అప్పజెప్పే కుట్ర జరుగుతోందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు దేశ విదేశాల్లో జరుగుతున్న అనేక అంశాలను పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు. దేశంలో అన్ని మతాలు అన్ని కులాలు సమానంగా ఉండాలని, సమసమాజ నిర్మాణం జరగాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాశారని తెలిపారు. ప్రస్తుతం కొంతమంది పాలకులు అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నిత్యం కరువు కాటకాలకు గురవుతున్న అనంతపురం జిల్లాలో పేద విద్యార్థుల విద్యాభివద్ధికి ప్రభుత్వాలు కషి చేయాలన్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. హాస్టళ్లలో వసతులు పెంచాలన్నారు. ప్రతి తరగతికీ ఒక గది, ప్రతి సబ్జెక్టుకూ ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బంగి శివ, ఓతూరు పరమేష్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గహాల్లో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేయాలని కోరారు. 117, 77 జీవోలను రద్దు చేయాలన్నారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. నీట్ పరీక్షను రద్దుచేసి నీట్ స్కాంకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధాతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విరాళం చెక్కును అందుకుంటున్న జెసి అస్మిత్

'అమరావతి'కి విరాళం

తాడిపత్రి : రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి తాడిపత్రికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు నరసింహులు మంగళవారం తాడిపత్రిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డికి పింఛన్ రూ.52,242 చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నరసింహులును ఎమ్మెల్యే అభినందించారు. సిఎం చంద్రబాబుపై నమ్మకంతో వృద్ధుడైన నరసింహులు భావితరాల భవిష్యత్తును ఆకాంక్షించి విరాళాన్ని ప్రకటించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు.

సిపిఎం నాయకులకు చెక్కు అందిస్తున్న శీలా జయరామప్ప

వయనాడ్ బాధితులకు అండగా నిలుద్దాం

సిపిఎం విరాళాల సేకరణకు దాతల సహకారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేరళ రాష్ట్రంలో వయనాడ్ ప్రజలకు అండగా నిలుద్దామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప తెలిపారు. వయనాడ్ బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నాడు నగరంలో విరాళాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తదితర సిపిఎం నాయకులు పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జయరామప్పను కలిశారు. ఈయన తనవంతు సహాయంగా రూ.10,116 చెక్కును సిపిఎం జిల్లా కార్యదర్శికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయనాడ్ బాధితుల కోసం సిపిఎం చేపట్టిన ఈ సహాయార్థం కార్యక్రమం ఆదర్శనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాగే స్పందించి బాధితులకు ఉదారంగా విరాళాలిచ్చి వారికి సంఘీభావాన్ని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా కోశాధికారి, రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, సిపిఎం నగర రెండో కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వంట ఏజెన్సీ మార్పుపై వివాదం

ప్రజాశక్తి-కుందుర్పి

కుందుర్పి దళిత కాలనీలోని ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న వంట ఏజెన్సీ నిర్వహణ మార్పుపై మంగళవారం పెద్ద ఎత్తున వివాదం నెలకొంది. గత 20 ఏళ్లగా ఏజెన్సీని నిర్వహిస్తున్న వారిని కాదని కొత్త వారికి ఇచ్చేందుకు టిడిపి నాయకులు ప్రయత్నించారు. దీంతో నిర్వాహకులు తమ కడుపుకొట్టొద్దని, 20 ఏళ్లుగా ఎలాంటి వివాదాలూ లేకుండా ఏజెన్సీని నిర్వహిస్తున్నామంటూ నిర్వాహకుడు వన్నూరప్ప, భార్య లక్ష్మీదేవి, రామలక్ష్మి, లచ్చక్కలు ప్రాధేయపడ్డాడు. కాగా ఇప్పటి నుంచి పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీని నిర్వహించేందుకు కొల్లక్క వెంకటేశులుకు ఎమ్మెల్యే నుంచి ఆదేశాలు ఉన్నాయంటూ టిడిపి నాయకులు తెలిపారు. ఈ క్రమంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏజెన్సీ నిర్వహణపై వాదోపవాదాలు జరిగాయి. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు జోక్యం చేసుకుని పాఠశాల కమిటీల ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆ కమిటీ సూచించిన వ్యక్తితో ఏజెన్సీ నిర్వహించేలా చర్యలు చేపడతామని తెలిపారు. అంత వరకు ప్రస్తుతం ఏజెన్సీ నిర్వహిస్తున్న వారే పిల్లలకు భోజనం అందించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ సర్పంచి పెద్ద నరసింహప్ప, నాయకులు నాగేంద్ర, ఓబయ్య, మర్రిస్వామి, వెంకటేశులు, రామ్మూర్తి నాయుడు, సత్తి, నాగరాజు పాల్గొన్నారు.

'ఓడినా వైసిపికి బుద్ధిరాలేదు'..

బుక్కరాయసముద్రం : రాష్ట్రంలో ప్రజలు ఓటుతో వైసిపిని ఛీత్కరించినా బుద్ధిరాలేదని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బిజెపి నేతలు కృషి చేస్తుంటే ఓర్చలేని వైసిపీ నేతలు, సోషల్ మీడియాలో, ఆ పార్టీకి చెందిన దినపత్రికల్లో అవాస్తవ వార్తలు రాయటం సరికాదన్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజునే పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిల్ విధానాన్ని రద్దు చేసే సంతకాలు చేయడం కనబడలేదా.. అని ప్రశ్నించారు. అలాగే ఈనెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్న క్యాంటీన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుడుతున్నారన్నారు. ఇప్పటికైనా వైసిపి, అనుకూల మీడియా వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు.

జీవో 117ను రద్దు చేయాలి

53 జీవో ప్రకారం టీచర్లను నియమించాలి-యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆర్‌జెడికి వినతిపత్రం సమర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాఠశాల విద్యావ్యవస్థ వినాశనానికి కారణమైన 117 జీవోను తక్షణమే రద్దు చేసి 53 జీవో నెంబర్ ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్‌జెడి కడప శామ్యూల్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఫ్రీ ప్రైమరీతోపాటు 1 నుంచి 5 తరగతులు ఒకే పాఠశాలగా ఉండాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, అన్ని పాఠశాలల్లో ఒకే రకమైన సిలబస్, పరీక్ష విధానాన్ని ప్రవేశపెట్టాలని, హైస్కూళ్లలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులకు ఎలాంటి బోధనేతర పనులను కేటాయించకూడదన్నారు. పని భారం తగ్గించాలన్నారు. ప్రతి హైస్కూళ్లకూ నాన్ టీచింగ్ సిబ్బందిని కేటాయించాలని, ఎయిడెడ్ పాఠశాలల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, మినిమం టైంస్కేలు, ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులర్ చేయాలని, ప్లస్ టు పాఠశాలల్లో పిజిటి పోస్టులకు రెగ్యులర్ ప్రమోషన్లు ఇవ్వాలని, పాఠశాలలకు రావాల్సిన అన్నిరకాల గ్రాంట్లను తక్షణం మంజూరు చేయాలని, విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని, వేసవి సెలవుల్లో నాడు-నేడు, ప్లస్ టు తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత శెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గౌరవాధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ కిలోమీటరు పైబడి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్నం భోజనం మెనూను సవరించాలని, మునిసిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని, కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీసును వెంటనే విడుదల చేయాలన్నారు. ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ పీజీటీలకు జూనియర్ లెక్చరర్ హోదాలో కల్పించాలని, ఎయిడెడ్ నుంచి స్థానిక సంస్థలు మరియు ప్రభుత్వ పాఠశాలలో అబ్జార్బ్ అయిన ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బికె.నారాయణ, మల్లికార్జున, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు తిరస్కరించినా మారని వైసిపి నేతల తీరు

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

వైసిపి దాడిలో గాయపడిన బాలింతకు పరామర్శ

గాయపడిన బాలింతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజలు ఛీకొట్టి.. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ఘోరంగా ఓడించినా వైసిపి నాయకుల తీరు మారకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. రెండు రోజుల క్రితం గుమ్మగట్ట మండలం బిటిపి ప్రాజెక్టు గ్రామంలో ఐటిడిపి ప్రతినిధి రవిచంద్ర కుటుంబంపై వైసిపి నాయకుడు గోవిందు దాడి చేయడంతో బాలింత అయిన చంద్రకళ గాయపడి రాయదుర్గం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆసుపత్రికి చేరుకుని మహిళను పరామర్శించారు. అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా దీవెనతో రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనప్పటికీ వైసిపి నాయకుల ధోరణి మారకపోవడం దురదృష్టకరన్నారు. చంద్రకళ కాన్పు కోసం పుట్టింటికి వస్తే వైసిపి నాయకుడు గోవిందు దాడి చేయడం బాధాకరమన్నారు. చంద్రకళ పొత్తికడుపుపై విచక్షణారహితంగా కాలితో తన్నారని తలకు గాయమైందన్నారు. ఘటనపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్ఐ బాధితులపైనే కేసు నమోదు చేయడం విచారకరమన్నారు. పోలీసుల్లో ఇంకా వైసిపి వాసన పోలేదని, ఇప్పటికైనా కొంతమంది పోలీసులు తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ విషయమై పోలీసులు బాధితులకు న్యాయం చేయకపోతే హోంమంత్రి దృష్టికి తీసుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే హెచ్చరించారు.

బహుమతులు అందజేస్తున్న అతిథులు

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

జెఎన్‌టియు ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

స్వామి వివేకానంద బోధనలను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జెఎన్‌టియు ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. రామకృష్ణ మఠం 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో యువజాగృతి సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రశంసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితాన్ని స్వామి వివేకానంద సూక్తులు ఉత్పన్నం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, జాతీయ సేవాపథకం అధికారి జి.మమత, ఎం.రామశేఖరరెడ్డి, దిలీప్‌కుమార్, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి బిసాటి భరత్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రమేష్ నారాయణ, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న జెడి డా.దేవసాగర్

కుష్టు వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు

కుష్టువ్యాధి నివారణ రాష్ట్ర జేడీ దేవసాగర్

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

కుష్టువ్యాధిపై నిర్లక్ష్యం వహించకూడదని కుష్టువ్యాధి నివారణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ సూచించారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని జెడి మంగళవారం పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.ఇబి.దేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్య రావు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెడెంట్ వెంకటేశ్వరరావు, ప్రభుత్వ ఆసుపత్రి చర్మ వ్యాధుల విభాగం వైద్యులతో చర్చించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఇంటినీ ఏఎన్ఎం, వాలంటీర్లు సందర్శించి చర్మంపై స్పర్శ , జ్ఞానం లేని నొప్పి లేదా దురద లేని మచ్చలు ,చర్మంపై ఎర్రని, రాగి రంగు మచ్చలు ,చేతులు, పాదాల తిమ్మిర్లు ఉన్న కనుబొమ్మ, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం ఉన్న ఇతర ఏ రకమైన అనుమానిత లక్షణాలపై సర్వే చేయాలన్నారు. ఆయా లక్షణాలు ఉంటే వైద్య సిబ్బందికి చూపించాలని కోరారు. ప్రాథమిక దశలో కుష్టు వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే వ్యాధి ఏ దశలోనైనా నయమవుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా మందులు లభిస్తాయని, ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్ రెడ్డి, పిఎమ్ఓ నాగన్న ,హెచ్ ఈ ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై హత్యాయత్నం

పెట్రోల్ పోసి నిప్పంటించిన వ్యక్తి

ప్రజాశక్తి-రాయదుర్గం

పార్వతి వద్ద సంఘటన వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ శ్రీనివాసులు

పట్టణంలో మంగళవారం సాయంత్రం దారుణ ఘటన చోటు చేసుకుంది. మహిళపై ఓ వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... రాయదుర్గం పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీలో నివసిస్తున్న పార్వతి, మోహన్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తుండేది. ఇదివరకు మహిళ కుమార్తె పేరిట రూ.రెండు లక్షల డిపాజిట్ ఉండేది. మోహన్ ఈ డబ్బులు కావాలని చెప్పి కుమార్తెను తీసుకెని వెళ్లాడు. రెండు లక్షల రూపాయలు ఇస్తేనే కూతుర్ని ఇస్తానంటూ పార్వతికి చెప్పాడు. తాను డబ్బులు ఇస్తానని, తర్వాత తమ జోలికి రాకూడదని అతనితో ఒప్పందం చేసుకున్నారు. ఇదే సమస్యపై గత కొంతకాలంగా ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పొదుపు సంఘం సమావేశానికి పార్వతి వెళుతుండగా మోహన్, అతని సోదరుడు సిద్ధలు ఆమెపై దాడి చేశారు. తమతో పాటు తెచ్చుకున్న పెట్రోల్‌ను పోసి, నిప్పంటించారు. స్థానికులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే 60 శాతం శరీరం కాలిపోయినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి ప్రభుత్వాసుపత్రికి వచ్చి పార్వతి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసులు తెలిపారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న జెసి అస్మిత్‌రెడ్డి

మధ్యాహ్న భోజనం పరిశీలన

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా భోజన నాణ్యతను పిల్లలను అడిగి తెలుసుకున్నారు. తానే స్వయంగా భోజనాన్ని వడ్డించి పిల్లలతో ముచ్చటించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నాగరాజు, రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, అరవింద్, నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరుకుల ప్రజాపోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మారెప్ప

పామిడి : ఆంధ్రప్రదేశ్ ఎరుకల ప్రజాపోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండలంలోని ఎద్దులపల్లి గ్రామానికి చెందిన ముసాది మారెప్పను నియమించినట్లు సంగం రాష్ట్ర అధ్యక్షుడు సాకే గోవిందు తెలిపారు. ఈ సందర్భంగా ముసాది మాట్లాడుతూ ఎరుకుల కులస్తుల్లో ఐక్యతకు కృషి చేయడంతోపాటు హక్కుల సాధనకు పోరాటాలు చేస్తానన్నారు.

'గూగూడు' హుండీ లెక్కింపు

నార్పల : మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి జంట ఆలయాల్లో ఏర్పాటు చేసిన ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ ద్వారా రూ.6,84,310 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యకారి నిర్వహణ అధికారి సాకేతపురం శోభ తెలిపారు. అలాగే నేల కందకం లెక్కింపులో రూ.1,05,708, వెండి 60 కిలోలు, వెండి 79.540 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు 'ఓటీ' ఇవ్వాలి

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులకు ఎలక్షన్ విధులకు సంబంధించి ఓటీ ఇవ్వాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నగర కమిటీ అధ్యక్షులు ఎర్రిస్వామి, కార్యదర్శి తిరుమలేశు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలు గడిచి మూడు నెలలుగడుస్తున్నా బకాయి ఓటీ చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం బాధాకర మన్నారు. ఇప్పటికైనా కార్మికులకు రావాల్సిన ఓటీ తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చుండూరు అమరులకు నివాళి

అనంతపురం కలెక్టరేట్ : అత్యంత కిరాతకంగా హత్య గురైన చుండూరు మృతవీరులకు దళితసంఘాల ఆధ్వర్యంలో మంగళవార నగరంలోని బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నివాళులర్పించారు. అలాగే పీడిత ప్రజల గొంతుక, ప్రజా యుద్ధనౌక కామ్రేడ్ గద్దర్ వర్ధంతిని పురస్కరించుకుని నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఓబులేసు, గంగాధరప్ప, ఎస్సీ, ఎస్టీ జెఎసి సాకే హరి, సమతా సైనిక్ దళ్ సుగుమంచి శ్రీనివాసులు, జైభీమ్‌రావ్ పార్టీ కొడవండ్ల నరేష్, రామకృష్ణ, ఓబుల రాజు, పెయింటర్ రామాంజనేయులు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు చేనేత జెండా ఆవిష్కరణ

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఎపి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం చేనేత జెండాను ఆవిష్కరించనున్నట్లు చేనేత అధ్యక్షులు చింతా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

ఆశా డేపై సమీక్ష

వజ్రకరూరు : ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడేపై వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి పావని తల్లిపాల ప్రాధాన్యతపై ఆశావర్కర్లకు అవగాహన కల్పించారు. అలాగే ఈనెల 20న నిర్వహించనున్న డీ వార్మింగ్ డేపై చర్చించారు. డీ వార్మింగ్ రోజు 1-19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగారంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ,హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో రాణించిన విద్యార్థికి అభినందన

గుత్తి : మండలంలోని చెర్లోపల్లి గ్రామ పరిధిలోని సేవాఘడ్‌లో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి వి.సంతోష్‌నాయక్ ఏసియన్ క్రీడా పోటీల్లో రాణించడంతో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు మంగళవారం అభినందించారు. సంతోష్‌నాయక్ ఇటీవల జపాన్‌లో జరిగిన ఏషియన్ జంప్ రోప్ ఛాంపియన్ షిప్-2024 క్రీడాపోటీల్లో దేశం తరుపున పాల్గొని రెండవ ర్యాంకులో నిలిచాడు. దీంతో అక్కడి నుంచి స్వదేశానికి తిరిగి రావడంతో పాఠశాల వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. ఫయాజ్, పిఈటి విజయ్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారమని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఇబి.దేవి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నగరంలోని తెలుగుతల్లి విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ ప్రతి తల్లి కాన్పు అయినా గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. దీనివల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి అంటు వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. ఆరునెలల తర్వాత రెండేళ్ల వరకూ తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారం ఇవ్వాలన్నారు. అనంతరం సిబ్బందితో తల్లిపాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, ఆర్ఎంఒ హేమలత, ఐసిడిఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి, చిన్నపిల్లల విభాగం అధికారి డాక్టర్ రవికుమార్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగంధర్, రవి శంకర్, మెడికల్ ఆఫీసర్ పుష్పలత, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనా అధికారి గంగాధర్, చిన్నపిల్లల విభాగం డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : తల్లిపాలతోనే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ తిరుపాల్‌బాయి తెలిపారు. మంగళవారం ఉరవకొండ మండల పరిధిలోని నింబగల్లు, విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవజాత శిశువులకు తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రామాంజినమ్మ, ఈశ్వరీదేవి, శ్రీదేవి, దుర్గాదేవి, ఈరమ్మ, మల్లేశ్వరి, ఆదిలక్ష్మి, రాధ, నాగవేణి, లక్ష్మీదేవి, ఎం.సువర్ణ, ఆశావర్కర్లు శాంతమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : తల్లిపాలే అప్పుడే పుట్టిన బిడ్డకు శ్రేష్టకరమని తహశీల్దార్ బ్రహ్మయ్య, ఎంపిడిఒ విబి.రమణ, ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాశంకరమ్మ సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో వివిధ రకాలతో తయారు చేసిన వంటలు, ఆకుకూరలు, కాయలు, పండ్ల స్టాళ్ల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా అన్నారు. కావున ప్రతి ఒక్క అమ్మ అపోహలు విడినాడి బిడ్డకు పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పి.ఉమాదేవి, వాణిశ్రీ, అన్నపూర్ణాదేవి, జ్యోతి, నాగమణి, ధనలక్ష్మి, కౌసల్య, హేమలత, దౌలా, ఓబులేసు, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, అధికారులు

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఇబి దేవి

బెలుగుప్ప : పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టిస్తేనే బిడ్డకు శ్రీరామరక్ష అని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శ్రీరంగాపురం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, లక్ష్మి, అంగన్వాడీలు కె.సత్యవతి, ఎం.సునీత, లక్ష్మీదేవి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ఊపిరి..

జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ఊపిరి పోసిన వారు అవుతారని జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి సుదర్శన్‌రావు తెలిపారు. మంగళవారం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల, జాతీయ సేవా పథకం, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి సంయుక్తంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణ దానంతో సమానం అన్నారు. రోజూ ఎక్కడో ఒక చోట ఎవరికో ఒకరికి రక్తం అవసరమవుతోందన్నారు. ఇందుకుగాను స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తం ఇస్తే అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ఉపయోగపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేస్తే అర్యోగానికి కూడా చాలా మంచిది అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అరుణ క్రాంతి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. సిఇ విభాగాధిపతి, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారిణి జి.మమత మాట్లాడుతూ ఇలాంటి సేవ కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో సేవాభావం పెంపొందుతుందన్నారు. రక్త దానం కేవలం ప్రాణాలు కాపాడడమే కాకుండా మానవత విలువలు సైతం కాపాడుతుందని తెలిపారు. అనంతరం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్వజన ఆసుపత్రి రక్తనిధి వారు అభినందన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.ఆనంద, ఎం.రామశేఖరరెడ్డి, జోజిరెడ్డి, శ్యాంబాబు, నీరజ, వివిధ విభాగాధిపతులు, రక్తనిధి సిబ్బంది బాలాజీ, రమణారెడ్డి, మురళీమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి

తహశీల్దార్లకు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలెక్టరేట్‌లో పరిపాలన అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మారుతీప్రసాద్‌ను గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వి.లక్ష్మీనారాయణ, జిల్లా సహాధ్యక్షులు శివశంకర్, ప్రధాన కార్యదర్శి హనుమంతు, ఉపాధ్యక్షులు మహేష్, రామాంజినేయులు, చిరంజీవి, రవికుమార్, భగీరథరెడ్డి, నగర అధ్యక్షులు శివశంకర్, నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, ఆశ్వర్థరెడ్డి, రాఘవేంద్ర, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.


మారుతీప్రసాద్‌ను సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

బుక్కరాయసముద్రం : తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పుణ్యవతిని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు పసపుల హనుమంతురెడ్డి, బీసీ నాయకులు పొడరాళ్ల రవీంద్ర మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ బండి ఆదినారాయణ, పెద్దప్పయ్య, నాగార్జున, గంగాధర్, ఈశ్వరయ్య, శివారెడ్డి, రవీంద్ర, తలారి ఆది, ఓబులపతి, బాబా ఫక్రుద్దీన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం తహశీల్దార్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

శింగనమల : మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన బ్రహ్మయ్యను మండల టిడిపి నాయకులు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, మాజీ మండల కన్వీనర్ చితంబరి దొర, నాయకుల అట్టే రామాంజనేయులు, ఏకిల ఆదినారాయణ, తరిమెల పెద్దిరెడ్డి, మాసూల చంద్రమోహన్, సుధీర్‌రెడ్డి, బీసీ నాగేంద్ర, సి.వెంకటేష్, పెద్ద నాగముని, కొయ్యగూర పెద్దన్న, వసూద్‌వలి, కాయగూరల సత్తి, శివ, బండి వెంకటనారాయణ, రాచేపల్లి సాంబ, చిన్న ఆంజనేయులు, డ్రిప్పు ఓబులేష్, ఈస్ట్ నర్సాపురం ఓబులేష్, కొండయ్య, బండమీదపల్లి చెన్నరాయుడు, తరిమెల చిరంజీవి, మొండిపోగుల ఎర్రిస్వామి, నిదనవాడ చినరాయుడు, లోలూరు నారాయణస్వామి, రవిశంకర్, చిన్న లింగన్న, వినోద్‌కుమార్, నారాయణస్వామి, శంకర్, జడేజా, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల తహశీల్దార్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

వజ్రకరూరు : ఉరవకొండ మండల ప్రజల సమస్యలను పరిష్కరించడంతోపాటు మెరుగైన సేవలు అందించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు నెరమెట్ల యల్లన్న, ఎల్లన్న అంబేద్కర్ సేన రాష్ట్ర నాయకులు సాకే.బి.రమేష్ కోరారు. ఈమేరకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉరవకొండ తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాను దళిత సంఘాల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కోనాపురం ఎర్రిస్వామి, ఎస్సీ జనసంఘం నియోజకవర్గ అధ్యక్షులు రాయంపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ తహశీల్దార్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

డి.హీరేహాల్ : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ అనిల్‌కుమార్‌ను మండలంలోని ఓబుళాపురం గ్రామ టిడిపి నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సోమనగౌడ, మాజీ సర్పంచి వెంకటేశులు, లాయర్ పంపాపతి, తాయప్ప, బసప్ప, రాజు, దుర్గప్ప, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ తహశీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

అహుడా నిబంధనలు పాటించాల్సిందే..

ప్రజాశక్తి-ఆత్మకూరు

అహుడా పరిధిలో ఇళ్లస్థలాల లేఔట్లు, ఇతర వాటి విషయంలో ఖచ్చితంగా నిబంధనలు పాటించేలా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో అహుడా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇందులో భాగంగా నిబంధనలకు అనుగుణంగా రియల్టర్లు ఉన్నారా.. లేదా.. అని ఆరాతీశారు. ఏదైనా సరే ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయక ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు స్థలాలు కొని.. ఇళ్లు నిర్మించుకున్న తర్వాత నిబంధనల గురించి మాట్లాడితే నష్టపోయేది ప్రజలేనన్నారు. రాప్తాడు పరిధిలో పెండింగ్ లో ఉన్న ఫైల్స్ ని వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. మరోవైపు పాపంపేటలో ప్రధాన సమస్యగా మారిన 30అడుగుల రోడ్డు మీద సుదీర్ఘంగా చర్చించారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఫీల్డ్ అసిస్టెంట్‌ను పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

ఫీల్డ్‌అసిస్టెంట్‌కు పరామర్శ

బొమ్మనహాల్ : గుండెపోటు వచ్చి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కొళగానహళ్లి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఉలిగప్పను సిఐటియు నాయకులు మంగళవారం పరామర్శించారు. ఉలిగప్ప పదేళ్ల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో కొత్తగా ప్రభుత్వం మారడంతో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆందోళనకు గురైన ఉలిగప్పకు గుండెపోటు వచ్చింది. వెంటనే బంధువులు అనంతపురంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, జిల్లా అధ్యక్షులు నాగమణి, ఆఫీస్ బేరర్స్ వెంకట్ నారాయణ, నాగరాజు, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నరసింహులు, తదితరులు ఆసుపత్రికి వెళ్లి ఉలిగప్పను పరామర్శించారు.

ఆర్జేడీకి అపుస్మా అభినందనలు

అనంతపురం : కడప విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి జిల్లాకు వచ్చిన శామ్యూల్‌ను జిల్లా ప్రయివేట్ పాఠశాల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అపస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, ఇక్బాల్ ట్రెజరర్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, స్టేట్ కన్వీనర్ నాగరాజు, ఆది, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శశిభూషణ్, లక్ష్మణ్, జలీల్, నారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, రామ్మూర్తి, మధుసూదన్‌రెడ్డి, రఘునాథరావు పాల్గొన్నారు..

ఆర్‌జెడిని సన్మానిస్తున్న అపుస్మా నాయకులు

ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని వినతి

కళ్యాణదుర్గం : గత కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ఏఎన్ఎంలు నాగలక్ష్మి, శైలజా కోరారు. ఈమేరకు మంగళవారం ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే సురేంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఆహ్వానం

ఈనెల 9న జిల్లాకేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహించే ఆదివాసీ దినోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరుకావాలని మంగళవారం ప్రజా వేదిక వద్ద ఎమ్మెల్యేను సబ్ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, గిరిజన పాఠశాల ప్రిన్సిపల్ నాగరాజు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి

బెలుగుప్ప : రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించేందుకు ఎంపిడిఒ సుబ్బరాజు ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కారాలయంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్ల నిర్మాణాల కింద కింద 90 రోజులు పని దినాలు కల్పించేందుకు హార్టికల్చర్ కింద పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు హౌసింగ్ ఇఎ శివారెడ్డి, సూర్యప్రకాష్, జెఇ జయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు స్వాతి, నాగేంద్రప్ప, విజయ్‌కుమార్, అరవింద్, నిర్మల, అనిల్‌కుమార్, హౌసింగ్ ఇన్స్‌పెక్టర్ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీం' హెచ్చరికను పరిగణనలోకి తీసుకోవాలి

అనంతపురం : దేశంలోని విద్యార్థుల భవిష్యత్తుపై సుప్రీం ధర్మాసనం చేసిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్) వ్యవస్థాపకులు పోతుల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల కంటే ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు, వివిధ రకాల ఉద్యోగాలకు శిక్షణ ఇచ్చే సంస్థలు నిర్వహించే భవనాలు అన్నీ బహుళ అంతస్థుల నిర్మాణాలు, సెల్లార్లలోనూ నడుస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ప్రతి జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఇదే పరిస్థితి రాష్ట్ర రాజధాని అమరావతిలోనూ ఉందన్నారు. ఇప్పటికే అనేక ఘటనలు కూడా జరిగిన విషయం తెలిసిందే అన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు స్వాతిలక్ష్మి, తెహర్నిశ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు స్నేహపూర్వకంగా పని చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వీటితోపాలు అనేక సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మోహన్‌రావు, పిహెచ్ఎం చెన్నమ్మ, రామలక్ష్మమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఫాతిమా, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, జానీరాజ్, సీనియర్ అసిస్టెంట్ సునీత, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ, ఆనంద్, శివానంద, ఫార్మాసిస్ట్ మహబూబ్‌బాషా, స్టాఫ్‌నర్స్, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఫొటో తీసే బాధ్యత తొలగింపుపై హర్షం

వినతిపత్రం సమర్పిస్తున్న విజయ్‌బాస్కర్

అనంతపురం క్రైం : ఉపాధ్యాయుల విద్యాబోధనకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న మరుగుదొడ్ల ఫొటోలను తీసే బాధ్యతను తొలగించడం సంతోషకరమని ఎపి రాష్ట్ర ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా టీచర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. విద్యావ్యవస్థను గాడిలో పెట్టడానికి జీవో 117ను రద్దు చేయాలని, టీచర్లకు నాడు-నేడు బాధ్యతల నుంచి మినహాయించాలని, డిఇఒ పూల్‌లో ఉన్న భాషాపండితుల సమస్యలు తీర్చాలని కోరినట్లు తెలిపారు.

ఎంసిఎ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో నిర్వహించిన ఎంసిఎ 2వ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్షలు ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ ఎస్ వి సత్యనారాయణ మంగళవారం విడుదల చేశారు. ఫలితాల కోసం కళాశాల అకాడిమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, డిప్యూటి కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్స్ డి.లలిత కుమారి, డి.విష్ణువర్ధన్, విభాగాల అధిపతులు భువనవిజయ, కె.ఎఫ్.భారతి, కళ్యాణి రాధ, ఎం.రామశేఖరరెడ్డి, దిలీప్‌కుమార్, జి.మమత, అజిత పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని టి. వీరాపురానికి చెందిన ఓబన్న (41) మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఓబన్న కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులతోపాటు అప్పులు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అప్పుడు ఎలా తీర్చాలో మదన పడుతూ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతునికి భార్య ఈరమ్మ, కుమారుడు ఉన్నారు.

నాపరాళ్ల ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

పెద్దవడుగూరు : నాపరాళ్ల ట్రాక్టర్ బోల్తా పడటంతో పెద్ద సూర్యనారాయణరెడ్డి(62) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరు గాయపడిన ఘటన పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లి రోడ్డులో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లికి చెందిన పెద్దసూర్యనారాయణరెడ్డి సొంత ట్రాక్టర్‌లో డ్రైవరు శివశంకరరెడ్డి, మరో కూలీ మద్దిలేటితో కలిసి పెద్దవడుగూరు ప్రాంతానికి నాపరాళ్లను తీసుకొస్తుండగా మండల కేంద్రంలో సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో పెద్ద సూర్యనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. శివశంకరరెడ్డి, మద్దిలేటికి స్వల్పగాయాలయ్యాయి. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం 108 వాహనంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం : పట్టణ శివారులో గంగాధర్ (45) అనే వ్యక్తి మంగళవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధర్ గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ బాధను తట్టుకోలేకనే గత్యంతరం లేని స్థితిలో పట్టణ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తికి జైలు

అనంతపురం క్రైం : పోక్సో కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, బాధితురాలికి రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి రాజ్యలక్ష్మి తీర్పును వెలువరించారు. వివరాల్లోకి వెళ్తే..పెద్దవడగూరు మండల కేంద్రంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో మైనర్‌పై అదే మండలం గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన తపిల రామాంజినేయులు తనను ప్రేమించాలని, తన కోర్కె తీర్చాలని ఆ అమ్మాయిపై బలాత్కారం చేయబోయాడు. అంతేకాకుండా... బ్లేడుతోను మరియు కత్తిపీటతో ఆమె గొంతుకోశాడు. ఆ బాధ భరించలేక సదరు అమ్మాయి గట్టిగా అరచిందనే విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. ఈమేరకు అప్పటి పెద్దవడగూరు ఏఎస్పై నారాయణ నాయక్ కేసు నమోదు చేశారు. అప్పటి పామిడి రూరల్ సి.ఐ రవిశంకర్ రెడ్డి దర్యాప్తు చేపట్టి నివేదికను (చార్జిషీటు) కోర్టుకు సమర్పించారు. అనంతపురం స్పెషల్ సెషన్స్ జడ్జి ఫర్ పోక్సో ట్రయిల్ కేసుల కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అంతేకాకుండా బాధితురాలికి రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో స్పెషల్ పి.పి కె.విద్యాపతి గారు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు

పుట్లూరు : మండలంలోని షేకుపల్లి నుంచి కూలీలతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి టాటా ఏసీ వాహనం ఢీకొనడంతో కూలీలు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని షేకుపల్లికి చెందిన కూలీలో ఆటోలో తాడిపత్రికి పనులకు వెళ్తుండగా ఎ.కొండాపురం గ్రామం సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన టాటా ఏసీ వాహనం ఢీకొంది. దీంతో ఆటోలో వెనుక కూర్చొన్న కూలీలు గాయపడ్డారు. వీరిలో ఒకరికి కాళ్లు, చేతులు విరగ్గా, మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తొండపాడు సమీపంలో నలుగురికి..

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో రంగనాథస్వామి ఆలయ సమీపంలో 67వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గుత్తి నుంచి యాడికి కి వెళ్తున్న ఆటోను వెనక వైపున లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇసురాళ్లపల్లికి చెందిన లక్ష్మీదేవి, జక్కల చెరువుకు చెందిన శ్రీనివాసులు, హుస్సేన్ పీరా, గొందిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న క్షతగాత్రులను ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, ఇసురాళ్లపల్లి సర్పంచి వాసుదేవరెడ్డి, టిడిపి నాయకులు ఎంకే.చౌదరి, జక్కలచెరువు ప్రతాప్, చికెన్ శీనా, రమేష్, తదితరులు పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం తీవ్రంగా గాయపడ్డ నలుగురిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.